విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలల్లో ఉపాధ్యాయులకు నిర్వహించిన వేసవి శిక్షణలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ఒకే రోజు మార్పు సాధ్యం కాదని, నిర్విరామంగా ప్రయత్నం జరగాలన్నారు. నిరుపేద రైతులు, కూలీలు, బడుగు బలహీన వర్గాల కుటుంబాల నుంచి వచ్చిన పిల్లల జీవితాలను బాగుచేసే అవకాశం ఉపాధ్యాయులకు లభించిందన్నారు. యువతకు మంచి విద్య, నైపుణ్యం అందించగలిగితే దేశం సూపర్‌పవర్‌గా ఎదుగుతుందన్నారు. సమాజంలో మంచి పునాది ఉండాలంటే ఉపాధ్యాయులు కీలకమన్నారు. ఉపాధ్యాయులకు ఈనెల 13నుంచి 31 వరకు పలు అంశాలపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వేసవి శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో అమలు చేయాలని కలెక్టర్ కోరారు. డీఈవో డి.మాధవి పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ చేస్తుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద ఉన్న గోడౌన్ లో ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి కలెక్టర్ రైతులకు పచ్చి రొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం పంట కోసం విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 6 వేల క్వింటాళ్ల జీలుగ, 6 వందల క్వింటాళ్ల జనుము విత్తనాలు సబ్సిడీపై పంపిణీకి కేటాయించామన్నారు. సేంద్రియ సాగులో పచ్చిరొట్ట ఒక ముఖ్యమైన భాగమని, నేల సారాన్ని పెంపొందించడంలో సహాయ పడతాయన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, రైతులకు పచ్చి రొట్టె జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాస్త్రజ్ఞులు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో భవనం కూల్చివేత



భవనం కూల్చివేస్తున్న అధికారులు

కోల్‌సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న భవనాన్ని శుక్రవారం రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కూల్చివేత ప్రారంభించారు. భవన యజమాని గాజుల రాజమల్లు, మరికొందరు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భవనం సెల్లార్, గ్రౌండ్, రెండు అంతస్థుల్లో ఉండగా రెండో అంతస్థు నుంచి కూల్చివేత ప్రారంభించారు. రాజీవ్ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అడ్డుగా షాపులు ఉండడంతో వాటిని తొలగించాలని నోటీసులు ఇచ్చారు. దీంతో సర్వీస్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. బస్టాండ్ వద్ద ప్రమాదాలు జరుగుతుండడంతో సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. రెండురోజుల క్రితం షాపులను తొలగించారు. గాజుల రాజమల్లు భవనం ఒక్కటే ఉండడంతో శుక్రవారం దానిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు చెక్

- విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలతో నిఘా
- ప్రతీ శుక్రవారం రోజ్‌గార్ దివస్ పేరిట సమావేశాలు
- జిల్లాలో పూర్తి కావస్తున్న కమిటీల నియామకాలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఉపాధిహామీ పథకం పనుల్లో జరుగుతున్న అవి నీతి అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం చర్య లు చేపడుతున్నది. ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు గ్రామస్థాయిలో విజిలెన్స్ మాని టరింగ్ కమిటీలను నియమిస్తున్నారు. జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. డిజిటల్ ట్రా కింగ్, రియల్ టైం రిపోర్టింగ్ ద్వారా ఉపాధిహామీ పథకాన్ని బలోపేతం చేయడంతోపాటు పథకాన్ని పారదర్శ కంగా అమలు చేసేందుకు కమిటీలను వేస్తు న్నారు. గతంలోనూ ఈ కమిటీలు ఉన్నప్పటికీ, నా మ్‌కే వాస్తేగా పనిచేశాయి. కమిటీలు పక డ్బందీగా పని చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది.

గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కూలీలు, ఇతరులు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస పోకుండా ఉండేందుకు 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని తీసుక వచ్చింది. ఈ పథకం ద్వారా యేటా జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలకు 100 పని దినాలు కల్పించాలని లక్ష్యం విధించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వమే నిధులను కేటాయిస్తోంది. కేటాయించిన నిధుల్లో 60 శాతం నిధులను కూలీలకు, 40 శాతం నిధులను మెటీరియల్ కాంపొనెంట్ పనులకు వెచ్చించాలని చట్టంలో పేర్కొన్నారు. ఏడాదికి సరిపడా ఉపాధి పను లను గుర్తించేందుకు యేటా నవంబర్, డిసెంబర్‌లో పనులను గుర్తిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు కేటాయించే పని దినాలు, బడ్జెట్‌ను, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు కేటాయిస్తుంది. జిల్లాలో 1.19 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులను జారీ చేయగా, వీటిలో 2.44 లక్షల మంది కూలీలు ఉన్నారు.

పెద్దపల్లి జిల్లాకు యేటా 20 నుంచి 27 లక్షల వరకు పని దినాలను లక్ష్యంగా విధిస్తున్నది. ఈ

(మిగతా 8వ పేజీలో)

• విజిలెన్స్ కమిటీలు నిర్వహించే విధులు..

ప్రతీ గ్రామంలో ఐదుగురు సభ్యులతో కూడిన విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తు న్నారు. ఈ కమిటీలో స్వయం సహాయక సంఘాల మహిళలతోపాటు ఎస్సీ, ఎస్టీలు ఉండే విధంగా కార్యాచరణ రూపొందించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈ కమిటీని ఎంపిక చేసి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు ప్రతిపాదిస్తారు. తద్వారా కలెక్టర్‌కు, అక్కడి నుంచి రాష్ట్ర అధికారులకు నివేదికలు పంపుతారు. రాష్ట్ర అధికారుల ఆమోదంతో ఈ కమిటీలు రంగంలోకి దిగనున్నాయి. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ వారానికి ఒకసారి పని చేసే ప్రదేశానికి వెళ్లి పరిశీ లించాల్సి ఉంటుంది. ప్రతీ శుక్ర వారం ఉపాధిహామీ సిబ్బంది, కూలీలతో రోజ్‌గార్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. ఇందులో చేసిన పనుల కొలత, కూలీలకు డబ్బుల చెల్లింపు, పనుల నాణ్యత, కూలీల సమస్యల గురించి మాట్లాడ నున్నారు. అలాగే వ్య యం, సంబంధిత రికార్డులను తనిఖీ చేయాల్సి ఉంటుంది. సామాజిక తనిఖీ జరిగే సమయంలో విజిలెన్స్ కమిటీ రూపొందించిన నివేదిక లను అధికా రులకు అందజేయనున్నారు. అందులో అక్రమాలు జరిగినట్లు తేలితే అందుకు బాధ్యులైన వారిపై అధి కారులు చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో ఈ కమిటీల నియామకాలు పూర్తి కావస్తున్నాయి.

రైతులకు ఇబ్బందులు కలగకుండా

ధాన్యం కొనుగోళ్లు

- ఒకటి, రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో బోనస్ జమ
- అదనపు కలెక్టర్ డి వేణు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డి వేణు

పెద్దపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేస్తున్నామని, గతంలో కంటే ఈ సీజన్‌లో అత్యధిక ధాన్యాన్ని కొనుగోలు చేశామని, సన్నరకం ధాన్యానికి ఒకటి, రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ కానున్నాయని అదనపు కలెక్టర్ డి వేణు అన్నారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ సీజన్‌లో 329 కొనుగోలు కేంద్రాలకుగాను 319 కేంద్రాలను ప్రారంభించామన్నారు. 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా కాగా, కేంద్రాలకు 3.54 లక్షల టన్నుల ధాన్యం రావచ్చని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 2,56,810 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇందులో దొడ్డు రకం 2,28,692 టన్నులు, సన్నరకం 28,112 టన్నులు ఉందన్నారు. 592.78 కోట్లకుగాను 512 కోట్ల రూపాయలు 84 శాతం చెల్లింపులు చేశామన్నారు. కేంద్రాలకు 60 నుంచి 70 వేల టన్నుల ధాన్యం రావచ్చని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పెద్దపల్లి, సుల్తానాబాద్, ధర్మారం మార్కెట్ యార్డుల్లో తడిసిన 3842 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. సన్నరకం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడం లేదని, ఆ రకం వరి కోతలు ఆలస్యమవుతున్నాయన్నారు. నిమ్మనపల్లి కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం కావడం లేదన్నారు. ఒక రైతుకు చెందిన ధాన్యంలో 17 శాతం తేమ రాలేదని కాంటా వేయలేదని, మరుసటి రోజు కాంటా వేస్తామని నిర్వాహకులు తెలిపారని, అయినా కొందరు రైతులు ధర్నా చేశారన్నారు.

జిల్లాలో 135 రైస్‌మిల్లులకు ధాన్యాన్ని కేటాయించామని, 48 మిల్లుల నుంచి బ్యాంకు గ్యారంటీలు వచ్చాయని, మిగతా మిల్లులవి కూడా వస్తున్నాయన్నారు. రెండు సీజన్ల కంటే ఈ సీజన్‌లోనే ధాన్యాన్ని ఎక్కువగా కొనుగోలు చేశామ న్నారు. 2022-23 యాసంగిలో 1,13,703 టన్నుల ధాన్యం, 2023-24లో 2,32,281 టన్నులు, ఈ సీజన్‌లో 2,56,810 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ వేణు చెప్పారు. ఈ సమావేశంలో డీఎస్‌వో రాజేందర్, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఎమ్మెల్యే



కోల్‌సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శుక్రవారం రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఆయన పుష్పగుచ్ఛం ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులను సీపీకి పరిచయం చేశారు. ఆయన వెంట నాయకులు బొంతల రాజేష్, మహంకాళిస్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, బాల రాజ్‌కుమార్, ముస్తాఫా తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ప్రతీ వరి గింజను కొనుగోలు చేస్తామని, 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయన రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహా న్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 57 లక్షల ఎకరాలలో వరి పంట సాగైందని, ప్రభుత్వం దాదాపు 17 వేల కోట్లు ఖర్చు చేస్తూ 79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, వీటికి అదనంగా సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగ్‌లు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టాలన్నారు. అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. రైతు సంక్షేమం దృష్టిలో ఉంచుకొని తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని మంత్రి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. జనవరి 25 తర్వాత రాష్ట్రంలో 1,57,467 కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశామని, వీటి ద్వారా 16 లక్షల 67 వేల 936 మంది ప్రజలకు అదనంగా రేషన్ అందుతుందని మంత్రి తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి వేణు, డీఎస్‌ఓ రాజేందర్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, డీఎస్‌ఓ శ్రీమాల, డీఆర్‌డీఓ కాళిందిని, డీఏఓ ఆదిరెడ్డి, డీఎంఓ ప్రవీణ్ రెడ్డి, పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో స్వచ్ఛతా పక్షోత్సవాలు ప్రారంభం



స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్న ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులు

జ్యోతినగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలో స్వచ్ఛతా పక్షోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత స్వచ్ఛతా పక్వాడాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ టౌన్‌షిప్ ఆవరణలో అధికారులు, ఉద్యోగులు శ్రమదానం చేసి వీధులను శుభ్రపరిచారు. ఉద్యోగులు, అధికారులతో ఈడీ స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో స్వచ్ఛ ర్యాలీని నిర్వహించారు. టౌన్‌షిప్‌లోని షాపింగ్ కాంప్లెక్స్ నుంచి ప్రధాన గేటు వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి తమ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 15 రోజులు రోజు స్వచ్ఛ భారత్‌ను నిర్వహించాలని, ప్రతి ఒక్క రూ పాల్గొనాలన్నారు. ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత, జీఎం కే.సి. సంగరాయ, సెంట్రల్ ఎస్‌బీసీ సభ్యుడు, ఐఎన్ టియుసి జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా, మహిళా సమితి సీనియర్ సభ్యురాలు రూపా సింగరాయ, ఏజీఎం హెచ్‌ఆర్ విజయ్ కుమార్ సిక్దర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి

పెద్దపల్లి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధి సోకకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి అన్నారు. డెంగ్యూ నివారణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఆసుపత్రి నుంచి ర్యాలీగా వచ్చి అయ్యప్ప టెంపుల్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ముఖ్యంగా ఇంటి పరిసరాలలో మురుగునీరు చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమలతోనే ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. లక్షణాలు కనబడితే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మాణం
- పెచ్చులూడుతున్న పైకప్పు
- పగుళ్లు చూపుతున్న గోడలు
- నూతన భవనం నిర్మించాలని కోరుతున్న ప్రజలు





శిథిలావస్థలో ఆసుపత్రి ఆవరణం

కాల్వశ్రీరాంపూర్, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. సుమారు నాలుగున్నర సంవత్సరాల క్రితం ఆసుపత్రి నిర్మించగా ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వర్షాలు కురిస్తే ఆసుపత్రి స్లాబ్ ఉరుస్తుంది. దీంతో ఆసుపత్రిలోకి నీరు చేరి రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. గోడలు కూడా పగుళ్లు బారాయి. ఆసుపత్రిపై భాగాన అక్కడక్కడ పెచ్చులు ఊడుతున్నాయి. పెచ్చులు ఊడి కింద పడితే రోగులకు, సిబ్బందికి ప్రమాదం జరిగే అవ కాశం ఉంది. డాక్టర్లు, సిబ్బంది ఉండే క్వార్టర్లు కూడా ఆనవాళ్లు లేకుండా పోయాయి. ప్రభుత్వం స్పందించి నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

• ఆసుపత్రి వివరాలు ఇలా..

కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో 1960లో ప్రభుత్వ ఆయుర్వేదిక ఆసుపత్రి ఉండేది. అది మూతపడడంతో 1970లో ఆరు పడకలతో ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి నిర్మించారు. 1979లో మండలంలోని గం గారం గ్రామానికి చెందిన ఎమ్మెల్యే స్వర్గీయ జిన్న మల్లారెడ్డి 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయగా కాల్వశ్రీరాంపూర్ చెందిన మాజీ ఎమ్మెల్యే కాల్వ రామచంద్రారెడ్డి ఆసుపత్రి నిర్మాణానికి రెండెకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. దీంతో నాలుగున్నర సంవత్సరాల క్రితం 24గంటలు వైద్య సేవలు అందించే 30 పడకల ఆసుపత్రి నిర్మించారు. ఆ కాలంలో రహదారులు సరిగా లేక బస్సులు నడిచేవి కావు. దీంతో ఆసుపత్రితో పాటు సిబ్బంది ఉండేందుకు వీలుగా క్వార్టర్లను కూడా నిర్మించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది 24 గంటలు రోగులకు అందుబాటులో ఉండి వైద్యం అందించే వారు. ఓదెల, ముత్తారం, భూపాలపెల్లి జిల్లా టేకు మట్ల మండలం నుంచి రోగులు ఎడ్లబండ్ల ద్వారా వచ్చి వైద్యం చేయించుకునే వారు. వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉండడంతో ప్రసవా లతోపాటు పలు శస్త్రచి కిత్సలు జరిగేవి. క్రమంగా ఆస ుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గిపోయింది. ఆర్ఎంపీల సహా యంతో పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. ఈ ఆసుపత్రికి ఇప్పటికీ ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం మండలాల నుంచి రోగులు వస్తున్నారు. ఆసుపత్రి భవనం, సిబ్బంది క్వార్టర్లు నిర్మించి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం 30 పడకల ఆసుపత్రిని ఆరు పడకలుగా కుదించింది. భవనం నిర్మాణానికి రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఆసుపత్రి పడకలను కుదించడంపై ప్రజాప్రతిని ధులు నిరసన వ్యక్తం చేయడంతో ఆసుపత్రి నిర్మాణం నిలిచిపోయింది.



కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం


సంతోష్‌గౌడ్(ఫైల్)

ఇల్లంతకుంట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జవారిపేటకి చెందిన మేరుగు సంతోష్‌గౌడ్(35) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. సంతోష్‌గౌడ్ ట్రాలీ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఇటీవలే ఇంటి నిర్మాణం చేపట్టడంతోపాటు ఆటో సరిగా నడవకపోవడంతో దాదాపురూ.30లక్షల వరకు అప్పులయ్యాయి. దీనితో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంటి నుంచి ఆటోలోవెళ్లిన సంతోష్‌గౌడ్ గాలిపెల్లి గ్రామంలోని కెనాల్ సమీపంలో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య జ్యోతి, కుమార్తెలు శృతి,హర్షిత,కుమారుడు విశిత్‌గౌడ్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

గంభీరావుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీకి చెందిన కడారి బాలమణి(38) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో బాలమణి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొడుకు పెళ్లికోసం మైక్రో ఫైనాన్స్‌ల్లో, మహిళా గ్రూపుల్లో కలిపి 3లక్షల 50వేల రూపాయల వరకు అప్పుతీసుకుంది. తీసుకున్న అప్పులు నెలనెలా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. అప్పులు ఎలాకట్టేది అంటూ నిత్యం బాలమణి మానసికంగా కృంగిపోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో బాలమణి ఉరి వేసుకుంది. దీంతో ఇరుగుపొరుగు బాలమణిని ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి, బాలమణి మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతురాలుకు భర్త, ఇద్దరుకుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరళించి, కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రేమానందం తెలిపారు.

మద్యం మత్తులో నేత కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌లో కొండ రాకేశ్(43) అనే నేతకార్మికుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన రాకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి బీవైనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. నాలుగు జోడీల పవర్‌లూమ్స్ అద్దెకు తీసుకొని తండ్రి లక్ష్మీరాజంతో కలిసి రాకేశ్ నడిపిస్తున్నాడు. అప్పుడప్పుడు అతిగా మద్యం సేవించే రాకేశ్ మానసిక స్థితి సరిగా ఉండదు. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం మద్యం మత్తులో రాకేశ్ ఇంట్లోని వస్తువులు చిందరవందర చేసి భార్య ఉజ్వల, ఇద్దరు కొడుకులను నెహ్రూనగర్‌లోని తన తల్లిదండ్రుల వద్ద వదిలి తిరిగి అద్దె ఇంటికివచ్చాడు. రాత్రి రేకులషెడ్డులో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రి లక్ష్మీరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు టౌన్ సీఐ కె.కృష్ణ తెలిపారు.

వడదెబ్బతో హమాలీ కార్మికుడి మృతి

ఎలిగేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన హమాలీ కార్మికుడు మ్యాదవేణి రాజయ్య(52) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రోజంతా పనిచేసి సాయంత్రం అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జరగండి..జరగండి..

మహిళా డ్రైవర్లు వస్తున్నారండి

- ఈవీ ఆటో డ్రైవింగ్‌లో మహిళలకు శిక్షణ
- కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ
- శిక్షణ అనంతరం ఆటోలు కొనేందుకు రుణాలు

తిమ్మాపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇప్పటి వరకు పురుషులే ఎక్కువగా ఆటోలు నడుపుతున్నారు. ఆటో డ్రైవింగ్ చేసే ఆడవాళ్లు కనబటం అరుదు. కరీంనగర్‌లో త్వరలో మహిళా ఆటో డ్రైవర్లు కనిపించబోతున్నారు. ఎల్‌ఎండీ కాలనీలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలకు ఎలక్ట్రిక్ ఆటో(ఈవి)లో శిక్షణ ఇస్తున్నారు. ఏప్రిల్ 12పదిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి శిక్షణను ప్రారంభించారు.


ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ తరగతులను వీక్షిస్తున్న మహిళలు


ఆటోలో ప్రయాణిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి (ఫైల్)

కలెక్టర్ సహకారంతో శిక్షణ

సుధారాణి, మహిళ ప్రాంగణం జిల్లా మేనేజర్



కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చొరవ తీసుకొని మహిళలు, పురుషులకు దీటుగా ఎదగాలని ఈ శిక్షణ ప్రారంభించారు. మహిళలు ఉత్సహంగా శిక్షణకు హాజరవుతున్నారు. శిక్షణ పొందుతున్న మహిళలకు ఆటోలు కొనుగోలు చేసేందుకు బ్యాంకుల ద్వారా లోన్‌లు ఇప్పించి వారికి సహకారం అందిస్తామని కలెక్టర్ చెప్పారు. ఆటో శిక్షణకు బజాజ్ మోటర్స్ వారు ఉచితంగా ఆటోతోపాటు సహాయకుడిని, టీ షర్టులను ఇచ్చారు.

తొలి విడతలో 15 మంది

ప్రస్తుతం 15 మంది మహిళలకు ఈవీ ఆటో తొలి విడత శిక్షణ కొనసాగుతోంది. శిక్షణతోపాటు మధ్యాహ్నం ఉచితంగా భోజనం, సాయంత్రం జావ అందజేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్రైవింగ్‌లో ప్రాక్టికల్, థియరీ బోధిస్తున్నారు. శిక్షణ పొందే మహిళలు పూర్తిస్థాయిలో నైపుణ్యం సాధించే విధంగా తీర్చి దిద్దుతున్నారు. శిక్షణ తీసుకుంటున్న మహిళలకు మండల కేంద్రంలో ఉన్న జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కుకు తీసుకువెళ్లి నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం లెర్నింగ్ లైసెన్స్‌కు పరీక్షలు రాయించారు. అందరు మహిళాలు లెర్నింగ్ లైసెన్స్ సాధించారు. మొదటి విడతలో ఈవీ ఆటో డ్రైవింగ్ శిక్షణ తీసుకుంటున్న 15 మంది మహిళల్లో ఆరుగురు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఉన్నారు.




శిక్షణ పొందుతున్న మహిళా డ్రైవర్ ఆటోలో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దంపతులు, తిమ్మాపూర్ ఆర్టీఏ కార్యాలయం వద్ద ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్‌లో శిక్షణ తీసుకుంటున్న మహిళా ఆటో డ్రైవర్లు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పసునూరి శిరీష, కరీంనగర్, బ్యాచ్ ఇన్‌చార్జి



నేను పీజీ పూర్తి చేశాను. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతోనే ఈవీ ఆటో శిక్షణలో చేరాను. ఇక్కడ చాలా బాగా శిక్షణ ఇస్తున్నారు. లెర్నింగ్ లైసెన్స్ పొందాను. కలెక్టర్ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ శిక్షణ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది.

ఆటో కొనుగోలు చేసి నడుపుకుంటా

జె అర్చిత, బాలయ్యపల్లె



నేను బీటెక్ చేసినా ఉద్యోగం లభించలేదు. మహిళ ప్రాంగణంలో ఉచితంగా ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తుండడంతో చేరాను. శిక్షణ పూర్తయిన తర్వాత ఆటో కొని నడుపుకుంటా..

నా కూతురుకి మంచి భవిష్యత్తు ఇవ్వాలని..

అర్చనవతి, ఎల్బాక



నాకు ఆడపిల్ల పుట్టిందని అత్తింటివారు వేధించారు. ప్రస్తుతం తల్లి వద్దే ఉంటూ ఒక్క కూతురును పెంచుకుంటున్నాను. నా కూతురికి మంచి భవిష్యత్తు ఇవ్వలన్నదే నా లక్ష్యం. అందుకు ఆటో డ్రైవింగ్ నేర్చుకుంటున్నా. శిక్షణ పూర్తయ్యాక ఆటో కొనుక్కుని నా కాళ్లపై నేను నిలబడతా..

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తికి జైలు శిక్ష

కోల్‌సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలానికి చెందిన మాజీ జెడ్‌పీటీసీ కందుల సంధ్యారాణిని ఉద్దేశించి సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన లింగాపూర్ గ్రామానికి చెందిన నిమ్మరాజుల రవిపై నేరం రుజువు కావడంతో శుక్రవారం నాలుగు నెలల జైలుశిక్ష విధిస్తూ గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి నల్లాల వెంకట సచిన్‌రెడ్డి తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2020 మార్చి 30న అప్పటి పాలకుర్తి జెడ్‌పీటీసీ, లింగాపూర్ గ్రామానికి చెందిన కందుల సంధ్యారాణిని ఉద్దేశించి అదే గ్రామానికి చెందిన నిమ్మరాజుల రవి అసభ్యకరంగా ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేశారు. దీనిపై ఆమె అంతర్గాం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ నాగరాజు కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టగా, కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నహీద పర్వీన్ ప్రాసిక్యూషన్ తరపున వాదన వినిపించారు. నేరం రుజువు కావడంతో రవికి కోర్టుకు జైలు శిక్ష విధించింది.

బావిలో మునిగి యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లిలో శుక్రవారం బావిలో మునిగి పెద్ది రమేష్(30) అనే యువకుడు మృతి చెందాడు. రమేష్‌కు మూర్ఛ వ్యాధి ఉండడంతో ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించినట్లు మృతుడి తండ్రి బీరయ్య తెలిపారు. శుక్రవారం రమేష్ కుటుంబం వేరుపడగా ఇంటిలోని సామగ్రి వేరే ఇంటిలో సర్దుకున్నట్లు తెలిపారు. అనంతరం స్నానం చేస్తానని భార్యకు చెప్పి సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఈత కొడుతున్న సమయంలో ఆకస్మాత్తుగా మూర్ఛ వ్యాధి రావడంతో నీటమునిగి మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

దొనూర్ పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య వివాదం

- అడ్డుకునే యత్నంలో ఎంఈవోపై దాడి
- ఉపాధ్యాయుడి సస్పెన్షన్


గాయపడిన ఎంఈవో సీతాలక్ష్మి

ధర్మపురి, మే 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం దొనూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్‌లో కాశెట్టి రమేష్ అనే ఉపాధ్యాయుడిపై గడిపెల్లి మహేష్ అనే ఉపాధ్యాయుడు అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడిచేశాడు. గొడవను ఆపేందుకు యత్నించిన ఎంఈవో సీతాలక్ష్మి పైనా మహేష్ దాడి చేయడంతో ఆమెచేతికి గాయం అయింది. శుక్రవారం ఉదయం 9గంటలకు పీటీఏ సమావేశం నిర్వహించగా ఎంపీపీఎస్, జడ్పీహెచ్‌ఎస్ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఉపాధ్యాయులు స్కూల్ ఆవరణలో మాట్లాడు తుండగా జడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న గడిపెల్లి మహేష్, అక్కడే ఉన్న దొనూర్ ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న కాశెట్టి రమేష్‌పై దాడి చేశాడు. గతంలోనూ మహేష్ ప్రవర్తన బాగా లేదని సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాడిచేసిన గడిపెల్లి మహేష్ పై చర్యలు తీసుకోవాలని ఎంఈవో సీతాలక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఉదయ్ కుమార్ మహేష్‌పై కేసు నమోదు చేశారు. కాగా దాడిచేసిన గడిపల్లి మహేష్‌ను సస్పెండ్‌చేస్తూ డీఈవో రాము ఉత్తర్వులు జారీ చేశారు.


యువకుడికి వలపు వల

- మహిళ పేరిట వాట్సాప్ చాటింగ్
- చిత్రహింసలకు గురిచేసి రూ. 22వేలు దోపిడీ
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు


నిందితులని అరెస్టు చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): కామవాంఛ తీరుస్తామంటూ మహిళల పేరిట వాట్సాప్‌లో మెసెజ్‌లు పంపి యువకుడిని చిత్రహింసలకు గురిచేసి దోపిడీకి పాల్పడిన ముఠాలోని ఇద్దరు యువకులను శుక్రవారం కొత్తపల్లి పోలీసులు అరెస్టుచేయగా, మరొక నిందితుడు పరారీలో ఉన్నాడు. కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి వివరాలప్రకారం.. కొత్తపల్లి మండలంలోని చింతకుంట శాంతినగర్ ప్రాంతానికి చెందిన సరళ సందీప్(19) మరోఇద్దరు స్నేహితులు మల్కాపూర్, లక్ష్మీపూర్‌ప్రాంతానికి చెందిన పొన్నాల ప్రణయ్‌కుమార్(18), ఎండీ రెహాన్‌లు జల్సాలకు అలవాటు పడ్డారు. ప్రధాన నిందితుడు సందీప్ ఈనెల 6న తన ఫోన్‌నంబర్ ద్వారా మంచిర్యాల ప్రాంతానికి చెందిన ఓ యువకుడి(25)కు వాట్సాప్‌లో హాయ్ అయాం పూజ అంటూ మెసెజ్ చేశాడు. ఆమెసెజ్‌కు స్పందించిన యువకుడు చాటింగ్ ప్రారంభించాడు. కామవాంఛ తీరుస్తానంటూ ఆశ చూపడంతో అది నమ్మిన యువకుడు ఈనెల11న కరీంనగర్‌కు చేరుకున్నాడు. పథకం ప్రకారం దోపిడీ చేసేందుకు సిద్ధమైన ముగ్గురుయువకులు కొత్తపల్లి మండలకేంద్రానికి రమ్మని చెప్పారు. ఇందులో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై సదరు యువకుడి వద్దకు చేరుకుని పూజకు సంబంధించిన వారమంటూ మాట్లాడారు. ముందే అనుకున్న ప్రకారం బైక్‌పై వెలిచాల గ్రామశివారు ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడికి చేరుకున్న వెంటనే మంచిర్యాల ప్రాంతానికి చెందిన యువకుడిని చిత్రహింసలకు గురిచేశారు. ఈ సందర్భంలో 50వేల రూపాయలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన సదరు యువకుడు తనవద్ద ఉన్న 10వేల రూపాయలు నగదు అందజేశాడు. బంధువులు, స్నేహితులకు ఫోన్‌చేసి మరో 12వేల రూపాయలు ఫోన్‌పే ద్వారా తెప్పించుకుని, ఆ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేసి తీసుకున్నారు. తర్వాత సదరు యువకుడిని అక్కడనేవదిలేసి వెళ్లిపోయారు. ప్రధాన నిందితుడు అయిన సందీప్ గతంలో ఇదే తరహా దోపిడీలకు పాల్పడి వరంగల్‌లోని జువైనల్ హోంకు వెళ్లి శిక్ష అనుభవించాడు. ఈ ముగ్గురు ముఠా సభ్యుల దోపిడీకి గురైన బాధిత యువకుడు కొత్తపల్లి పోలీసుఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా కొత్తపల్లి ఎస్‌ఐ ఎస్ సాంబమూర్తి ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం రేకుర్తి బస్టాండ్ ప్రాంతంలో నేరానికి పాల్పడిన సందీప్, ప్రణయ్‌కుమార్ అనే ఇద్దరు యువకులను గుర్తించి అరెస్టు చేశారు. మరో యువకుడు ఎండీ రెహాన్ పరారీలో ఉన్నాడు. యువకులు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి సమక్షంలో పోలీసులు నిందితులను అరెస్టు చూపించారు.

జగిత్యాల జైత్రయాత్ర నేత.. నారాయణ మృతి


నారాయణ (ఫైల్)

కోరుట్ల రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జైత్రయాత్ర నేత పండుగ నారాయణ(75) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. కోరుట్ల మండలం సర్వరాజుపూర్ గ్రామానికి చెందిన పండుగ నారాయణ విప్లవ ఉద్యమాలకు ఆకర్షితుడై ఈ ప్రాంతంలో ఉద్యమాలకు స్వీకారంచుట్టాడు. కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, కథలాపూర్ మండలాలతోపాటు జగిత్యాల డివిజన్ పరిధిలో ప్రజలను చైతన్యవంతం చేశాడు. విద్యార్థులు, యువకుల విలేజ్‌క్యాంపెయిన్ చేసి జగిత్యాల పల్లెలు భూస్వాములకు వ్యతిరేకంగా కదిలి 1978జూలై17వ తేదీన ఏర్పాటుచేసిన రైతుకూలీసంఘ మహాసభ 'జగిత్యాల చైత్యయాత్రగా' ప్రసిద్ధి పొందడానికి నారాయణ కృషిచేశారు. ఎమర్జెన్సీ కాలంలో నారాయణ జైలుకు వెళ్లారు. ప్రస్తుతం ఆయన కుటుంబసభ్యులతోకలిసి మండలంలోని సర్వరాజుపూర్‌లో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజులుగా అనా రోగ్యంతో బాధపడుతున్న నారాయణ శుక్రవారం ఉదయం కన్నుమూశాడు. ఆయన అంత్యక్రియలు సర్వరాజుపూర్‌లో నిర్వహించగా రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు హాజరై సంతాపం ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఒకరికి గాయాలు


కొండ శ్రీనివాస్(ఫైల్)

గంగాధర, మే 16 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఇస్లాంపూర్‌వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతిచెందినట్లు ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. గంగాధర మండలం గర్శకుర్తికి చెందిన ఆంజనేయస్వామి మాలదారుడు కొండ శ్రీనివాస్(34) కొండగట్టుకు పాదయాత్రగా వెళుతున్నాడు. కొడిమ్యాల మండలం గౌరాపూర్‌కు చెందినకాసాని గణేష్(21), కాసాని రాజు గంగాధరనుంచి పూడూర్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఇస్లాంపూర్‌వద్దకు రాగానే బైక్‌పై వెళుతున్న వీరు.. రోడ్డు వెంట నడుచుకుంటూ వెళుతున్న శ్రీనివాస్‌నుఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన కొండ శ్రీనివాస్, కాసాని గణేష్, కాసాని రాజును కరీంనగర్ తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కాసాని గణేష్, కొండ శ్రీనివాస్ మృతిచెందారు. కాసాని రాజు చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేవీకేలో దుక్కి దున్నకుండా పంటల సాగు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాష్

జమ్మికుంట రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞానకేంద్రం (కేవీకే)లో దుక్కి దున్నకుండా పంటల సాగు-సుగుణ పునరుత్పాదక పద్ధతి ప్రాజెక్టును జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధిబ్యాంకు డీడీఎం జయప్రకాష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లోని మూడుమండలాల్లో గల 16గ్రామాల్లో 25మంది రైతులతో దుక్కి దున్నకుండా పంటల సాగుపైన ప్రయోగాత్మకంగా పరిశీలన చేస్తున్నామన్నారు. వ్యవసాయంలో ఇటువంటి నూతన సాంకేతిక పద్ధతులకు నాబార్డ్ ముందుండి ఆర్థిక సహాయం చేస్తూ ప్రోత్సహిస్తోందని తెలిపారు. జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సుగుణ పునరుత్పాదక పద్ధతి నేలరక్షణకి పునాది లాంటిది అన్నారు. పునాది బాగుంటేనే నేల నిర్మాణం, నేల ఆరోగ్యం బాగుంటుందన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ నూతన విధానాలను కలిసికట్టుగా చేయడం వల్ల వాటిలో ఉన్న లోటుపాట్లను సులభంగా తెలుసుకోవచ్చన్నారు. సుగుణ పుణరుత్పాదక పద్ధతి రూపకర్త చంద్రశేఖర్ బాట్సాలె గూగుల్ మీట్ ద్వారా వారియొక్క అనుభవాలను తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కె వెంకటేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

తెల్లారితే పెళ్లి.. ప్రియుడితో వెళ్లిపోయిన పెళ్లికూతురు

- చిన్న కూతురును ఇచ్చి వివాహం జరిపించేందుకు సిద్ధమైన తల్లిదండ్రులు
- మైనర్ కావడంతో అడ్డుకున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): తెల్లారితే వివాహం కావాల్సిన పెళ్లి కూతురు ప్రియుడితో కలిసి పారిపోయింది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, బంధువులు తమ పరువు పోతుందని భావించి చిన్న కూతురును ఇచ్చి వివాహం జరిపించేందుకు సిద్ధమయ్యారు. ఆమె మైనర్ అన్న సమాచారం తెలుసుకున్న అధికారులు వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఓ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. పెద్ద కూతురుకు ఇదివరకే వివాహం కాగా, రెండో కూతురుకు 15రోజుల క్రితం నిశ్చితార్థమైంది. ఈనెల16న వివాహానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లారితే పెళ్లిపీటలపై కూర్చోవలసిన పెళ్లికూతురు అదేగ్రామానికి చెందిన ప్రియుడితో కలిసి పారిపోయింది. బిడ్డ కనిపించడం లేదని ఆందోళనకు గురైన తల్లిదండ్రులు, బంధువులు ఆరాతీయగా విషయం తెలిసింది. పరువుపోతుందని వరుడికి తమ చిన్న కూతురు(మైనర్)ను ఇచ్చి పెళ్లి చేసేందుకు ఒప్పించారు. ఇరు కుటుంబాలు అంగీకరించడంతో వివాహానికి సిద్ధమయ్యారు. మైనర్‌కు పెళ్లి చేస్తున్నారనే సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు, తహసీల్దార్, పోలీసులు రంగప్రవేశంచేశారు. బాలిక పుట్టినతేదీని పరిశీలించి వివాహానికి మరో రెండునెలలు గడువు ఉందని, పెళ్లిచేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇరువర్గాలకు అవగాహన కల్పించి మైనారిటీ తీరేవరకు పెళ్లి చేయబోమని అంగీకారపత్రాన్ని రాయించుకున్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కొరడా.. ఎక్స్‌కావేటర్ సీజ్

జగిత్యాలరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలో మట్టి అక్రమ తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. మండల పరిధిలోని నర్సింగాపూర్ గ్రామశివారులోని సర్వేనంబర్ 437లో కొందరు ఎక్స్‌కావేటర్‌తో అక్రమంగా మట్టి తవ్వుతుండగా స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అక్రమ తవ్వకాలను గుర్తించి ఎక్స్‌కావేటర్ వాహనాన్ని సీజ్ చేశారు. సీజ్‌చేసిన ఎక్స్‌కావేటర్‌ని రెవెన్యూ అధికారులు జగిత్యాల బస్‌డిపోకు తరలించారు.

గుడుంబా పట్టివేత

కరీంనగర్‌క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్‌లో కరీంనగర్‌రూరల్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించి ఆరులీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. గుడుంబా కలిగిఉన్న ఇస్లావత్ సావిత్రపై కేసునమోదు చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. అనంతరం నిందితురాలిని తహసీల్దార్ ఎదుట హాజరుపరచి లక్షరూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేశామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు స్వప్న, శ్రీలత పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

రాయికల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన నీలి పెద్ద రాము ఎలక్ట్రిక్ బైక్ షార్ట్‌సర్క్యూట్‌తో శుక్రవారం దగ్ధమైంది. 2024 అక్టోబర్‌లో రూ.55వేలతో ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశాడు. బైక్ పట్టణంలోని తమ తోట వద్ద పెట్టి వ్యవసాయపనులు చేస్తుండగా వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. గమనించిన యాజమాని బ్యాటరీ స్విచ్‌ఆఫ్‌చేసినా దగ్ధమైనట్లు తెలిపాడు.


దగ్ధమైన బైక్ వద్ద యజమాని

నిశ్చితార్థం రద్దు చేసుకున్న యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం ఒకరితో చేసుకొని.. మరో యువతిని పెళ్లి చేసుకున్న ఓయువకుడిపై వధువు కుటుంబీకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధిత కుటుంబీకులు తెలిపిన ప్రకారం... హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్‌రెడ్డి చిన్న కుమారుడు సాఫ్ట్‌వేర్‌ఉద్యోగి మధుకర్‌రెడ్డికి కాట్రపల్లి గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ఇటీవల నిశ్చితార్థం జరిగింది. కట్నకానుకలు కూడా మాట్లాడుకున్నారు. 16వతేదీన పెళ్లి జరగాల్సి ఉండగా వరుడు మధుకర్‌రెడ్డి ఈనెల15న మరోయువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో తమను మోసం చేశారని అమ్మాయి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీ సులు విచారణ చేపట్టారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు



గణపతి అలంకరణ

ధర్మపురి, మే 16 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో శుక్రవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, మంత్ర పుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.




గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ఎడ్ల బండిపై ప్రయాణం, పుణ్యస్నానం ఆచరిస్తున్న యువతులు

స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచిఉన్న భక్తులు





పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు

ఆధ్యాత్మిక పుష్కరం.. అలౌకిక ఆనందం

- అంతర్వాహినిలో మునక.. పుణ్యస్నానాలకు ప్రతీక
- రెండో రోజు పోటెత్తిన భక్తజనం



కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): పుష్కరస్నానం.. సకల పాప హరణం... అని భావించే భక్తఘనకోటి సరస్వతీ పుష్కరాల్లో రెండో రోజున అంతర్వాహిని రూపంలో ఉన్న సరస్వతీ నదీ మాతల్లికి భక్తజనం నీరాజనం పలికింది. తొలిరోజు భక్తులసంఖ్య పలుచగా కనిపించినా.. రెండో రోజైన శుక్రవారం ఉదయం నుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. శుక్రవారం సాయంత్రం వరకు కాళేశ్వరం దర్శించుకున్న భక్తుల సంఖ్య 50వేలు దాటిందని అధికారులు అంచనా వేశారు. అయితే పుష్కరాల నిర్వహణలో అధికారుల వైఫల్యంతో అడుగడుగునా ఇబ్బందులు ఎదురైనా.. భక్తులు వీటన్నింటిని తోసిరాజని పుష్కర స్నానాలు ఆచరించి క్షేత్రంలో కొలువై ఉన్న ఆ మహాదేవున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

50 వేలకు పెరిగిన భక్తుల సంఖ్య

తొలిరోజు కొంత భక్తులు తక్కువ వచ్చినప్పటికీ.. రెండో రోజు సుమారు 50వేలకు పైగా భక్తులు వచ్చారు. కాళేశ్వరంలోని రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్, పోలీసులు ఉన్నప్పటికీ ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అన్ని చౌరస్తాల వద్ద పోలీసులు ఉన్నప్పటికీ భక్తులు ఎలా వెళ్లాలో, ఎటు నుంచి వెళ్లాలో ఎవరూ చెప్పిన దాఖలాలు లేవు. కనీసం చౌరస్తాల వద్ద సూచన బోర్డులు కూడా పెట్టకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 300 ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, వివిధ ప్రైవేటు వాహనాలు సుమారు 2800 వరకు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. మొత్తంగా సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చినట్లు తెలిపారు. సరస్వతీ ఘా ట్, ప్రధానఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

సరస్వతీ పుష్కరాల సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. సరస్వతీ నదిలో స్నానమాచరించిన అనంతరం నేరుగా ఆలయానికి వచ్చి శివ, యమ లింగాలను దర్శించుకున్నారు. అయితే వీఐపీలు వచ్చిన సందర్భంగా భక్తులను గంటసేపు నిలిపివేయడంతో తీవ్ర అసంతృప్తికి గురైన భక్తులు ఆలయ అధికారుల పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈవో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే పోలీసులు సైతం అత్యుత్సాహం చూపి భక్తులను సరైన పద్ధతిలో పంపించడం లేదని విమర్శలు చేశారు.



పిండ ప్రదానం



అప్రమత్తంగా ఉండండి





- మారిన జీవనశైలి.. ఆహారపు అలవాట్లు
- ముందు జాగ్రత్తలతో అదుపులో
- నేడు హైపర్‌టెన్షన్ డే

సుభాష్‌నగర్, మే16 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న విషయాలకే ఎక్కువగా ఆందోళనకు గురవుతుండడం.. ఎదుటి వారిపై అరవడం.. ఉద్వేగానికి లోనడం వంటి లక్షణాలను హైపర్‌టెన్షన్ అంటారు. సహజంగా ఇది అధిక రక్తపోటు కారణంగా వస్తుంది. అయితే ఆందోళన చెందని వారిలో కూడా దీని ప్రభావం ఉంటుంది. వారిలో కాళ్లు, చేతులు లాగడం, ఒత్తిడికి గురికావడం, బాగా తలనొప్పిగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఏది ఏమైనా హైపర్‌టెన్షన్‌తో కొన్నిసార్లు ప్రాణానికి ప్రమాదం తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రతి సంవత్సరం మే 17న హైపర్‌టెన్షన్‌డేను నిర్వహిస్తున్నారు. దీన్ని అదుపులో ఉంచుకోవడానికి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఎలా వస్తుంది..

హైపర్ టెన్షన్ (హైబీపీ)కి అధిక రక్తపోటు ముఖ్యకారణం. దీని బారిన పెద్దలే కాదు పిల్లలు ఉండడం ఆందోళన కలిగించే అంశం. అసలు అధిక రక్తపోటు అంటే ఏమిటి? ఎందువల్ల వస్తుంది? ఎటువంటి నివారణోపాయాలు తీసుకోవాలి? అనే అంశం మీద అవగాహన పెంచుకుంటే ఈ రుగ్మత నుంచి గట్టెక్కవచ్చు. లక్షణాలను బట్టి కారణాలు తెలుసుకోవచ్చు. నిర్ధారణ పరీక్షలు, చికిత్స నివారణ చర్యలు తీసుకుంటే అధిక రక్తపోటు నుంచి బయ ట పడడం పెద్ద కష్టమైన పనికాదు. అయితే దీనిని నిర్లక్ష్యం చేస్తే రక్తనాళాలు దెబ్బతిని ప్రాణాంతకమవుతుంది.

చికిత్స

అధిక రక్తపోటు మొదటి దశలో ఉంటే మందులు వాడడం ద్వారా తగ్గించుకోవచ్చు. ఒక రకం మందులు ఉపయోగించే వారిలో 50 శాతం మందికి అధిక రక్తపోటు అదుపులో ఉంటుంది. రెండు రకాల మందులు వాడేరోగుల్లో 80 శాతం మందికి ఈ వ్యాధి నియంత్రణలోకి వస్తుంది. గర్భిణుల్లో అధిక రక్తపోటు ఉంటే తల్లికి, బిడ్డకు ప్రమాదం కలిగే అవకాశాలు ఉంటాయి. ప్రసవ సమయంలో సమస్యలు ఏర్పడతాయి. బిడ్డపై ప్రభావం చూపలేని మందులను వారికి ఇవ్వాల్సి ఉంటుంది.

అధిక రక్తపోటుకు కారణాలు..

శరీరంలో నీటి శాతం తగ్గినా లేదా బలహీనంగా ఉన్నవారు తొందరగా ఆందోళనకు గురవుతారు. ఈ సమస్యల వల్ల అల్ప లేదా అధిక రక్తపోటు వచ్చే అవకాశం ఉంటుంది. అల్ప రక్తపోటు (లోబీపీ) కారణంగా గుండె పని విధానంలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇదీ చాలా ప్రమాదకరం. కొన్ని సందర్భాల్లో గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వెంటనే వైద్యులను సంప్రదించాలి. గర్భిణిలు కొన్నిసార్లు అల్ప లేదా అధిక రక్తపోటుకు గురవుతారు. హార్మోన్ల పని విధానం మారడమే దీనికి కారణం.

ఎవరికి వస్తుంది.

కుటుంబంలో అధిక రక్తపోటు ఉన్నవారు ఎవరైనా ఉన్నప్పుడు జన్యుపరంగా వస్తుంది. గుండె వ్యాధులు, మధుమేహం తదితర జబ్బులు అనువంశికత వల్ల వస్తున్నట్లయితే హైపర్‌టెన్షన్ వస్తుంది. 55 ఏళ్లు దాటిన వారికి అధిక బరువు ఉన్న వారికి, క్రియాశీలంగా లేని వారికి, మితిమీరి ధూమపానం, మద్యం సేవించే వారికి అధిక రక్తపోటు వచ్చే అవకాశాలున్నాయి. మనం తీసుకుంటున్న ఆహారంలో రెండు గ్రాములకు మించి ఉప్పు ఉన్నట్లయితే అధిక రక్తపోటుకు కారణం అదే అని చెప్పవచ్చు.

నిర్లక్ష్యం తగదు


చాలా మందికి తమకు అధిక రక్తపోటు గురించి అవగాహన లేకపోవడం వల్ల వారికి అధిక రక్తపోటు వచ్చిన విషయాన్ని గమనించ లేకపోతున్నారు. ఇది నిశ్శబ్దహంతకి. ఎటువంటి లక్షణాలు కనిపించకుండా అధిక రక్తపోటు ప్రాణాలను తీసుకుంటుంది. అధిక రక్తపోటును ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా హైపర్ టెన్షన్ తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది.

అదుపులో ఉంచుకోవాలి

డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్



ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లలో ఎంతో మార్పు వచ్చింది. ఆరోగ్యానికి హానిచేసే ఆహారాలకు అలవాటు పడ్డారు. అలాగే శరీరానికి ఏమాత్రం వ్యాయామం లేకుండా పోయింది. ప్రత్యేకంగా 40 సంవత్సరాలు దాటిన వారు క్రమంగా పరీక్షలు చేయించుకోవాలి. ప్రజలు తమ ఆరోగ్యాలకు వారే బాధ్యులు కాబట్టి జబ్బు వచ్చిన తర్వాత బాధపడేకంటే కారుండా జాగ్రత్త పడడం మేలు. హైపర్‌టెన్షన్‌ను అదుపులో ఉంచాలంటే శరీరం బరువు పెరగకుండా జాగ్రత్త పడాలి. కూరల్లో ఉప్పు తగ్గించాలి. ప్రతి రోజు వ్యాయామం చేయాలి. నిల్వ ఉన్న ఆహారాలకు దూరంగా ఉండాలి. ప్యాక్‌చేసిన ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు. పచ్చళ్ల వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలి. ఉప్పు లేకుండా మజ్జిగ, పెరుగు తీసుకోవాలి. చిరుతిళ్లను పూర్తిగా తగ్గించాలి.



మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలి

- క్షేత్ర స్థాయిలో కలెక్టర్లు పర్యటించాలి
- ఉమ్మడి జిల్లా కలెక్టర్ల సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

జగిత్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్లు మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల కలె క్టర్లు సత్యప్రసాద్, పమేలా సత్పతి, కోయ శ్రీహర్ష, సందీప్ కుమార్ ఝా, జగిత్యాల అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కలె క్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు సమన్వయంతో పనిచేస్తూ భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే రెవెన్యూ అధికారులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసేలా కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజలు, రైతుల సంక్షేమమే ప్రధానంగా కలెక్టర్లు పని చేయాలని తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకవెళ్లి విజయవంతం చేయడంలో భాగంగా అధికార యంత్రాంగం అవలంబించాల్సిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఉదయం అంతంత మాత్రంగా భక్తులతో కనిపించిన ఆలయం మధ్యాహ్నం వరకు భక్తుల తాకిడితో సందడిగా మారింది. సాయంత్రం వరకు 50 వేల మంది వరకు రాజన్నను దర్శిం చుకున్నారని అంచనా. ధర్మగుం డంలో స్నానాలకు అనుమతిం చక పోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నల్లాల వద్ద భక్తుల పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం పరివార దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. బద్ది పోచమ్మను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయ ఆవరణలో భక్తులు

సరస్వతి పుష్కరాల్లో 'మై నేషన్ ప్రిజన్స్ స్టాల్'



మై నేషన్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా

కరీంనగర్ క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా మై నేషన్ ప్రిజన్స్ స్టాల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ స్టాల్‌లో ఖైదీలు తయారు చేసిన పర్యావరణ హిత ఉత్పత్తులను ప్రదర్శించారు. వేములవాడ రాజరాజేశ్వర ఆలయం నుంచి సేకరించిన పుష్పాలను వినియోగించి తయారు చేసిన అగరుబత్తులు వేస్ట్ టు వెల్త్' ప్రొడక్ట్ ఈ ప్రదర్శన లో ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచాయి. ఖైదీలు చేతితో తయారు చేసిన సబ్బులు, నేసిన వస్త్రాలు, వివిధ రకాల ఉత్పత్తులను స్టాల్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జైళ్ళశాఖ వరంగల్ రేంజి డీఐజీ ఎం సంపత్, వరంగల్ జైళ్ళశాఖ అధికారి టి కలాసాగర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

ఏడాది కేంద్ర ప్రభుత్వం జిల్లాకు 13.99 లక్షల పని దినాలను మాత్రమే కేటాయించింది. ఉపాధి పనులు పారదర్శకంగా జరిగేలా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలు పర్యవేక్షించనున్నాయి.

విజిలెన్స్ కమిటీలతో పనుల్లో పారదర్శకత

- కాళిందిని, డీఆర్‌డీవో, పెద్దపల్లి

గ్రామస్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటుతో ఆయా గ్రామాల్లో జరిగే ఉపాధిహామీ పథకం పనుల్లో మరింత పారదర్శకత పెరగనున్నది. గతంలో గ్రామాల్లో వర్క్స్ కమిటీలు ఉండేవి. వాటినే విజిలెన్స్, మానిటరింగ్ కమిటీల పేరుతో పంచాయతీల్లో ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలో కమిటీల ఏర్పాటు పూర్తి కావస్తున్నాయి. ఈ కమిటీలు ప్రతీ శుక్రవారం రోజ్‌గార్ దివస్ నిర్వహించి ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించడంతోపాటు పనుల గురించి చర్చించనున్నారు.

తడి, పొడి చెత్తతో కంపోస్ట్ ఎరువుల తయారీ

షబ్బీర్ పాషా, ఎంపీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలో సానిటేషన్ పనులు నిర్వహిస్తున్నారా?

ఎంపీవో: ప్రతీ గ్రామంలో చెత్త సేకరణ జరుగుతోంది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తున్నాం. పొడి, తడి చెత్త, ప్లాస్టిక్‌ను వేరు చేసి విక్రయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: డంపింగ్ యార్డుల్లో తయారైన కంపోస్ట్ ఎరువును ఏం చేస్తున్నారు ?

ఎంపీవో: తయారైన కంపోస్ట్ ఎరువును హరిపురం, కొలనూర్, కనగర్తి గ్రామాల్లో రైతులకు, మిగతా గ్రామాలలో నర్సరీలకు ఉపయోగిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కంపోస్ట్ ఎరువులను విక్రయిస్తున్నారా?

ఎంపీవో: గతంలో రైతులకు విక్రయించాం. అధికారుల ఆదేశం మేరకు కూరగాయలు పండించే రైతులకు ఉచితంగా అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వచ్చే వానాకాలంలో ఎలాంటి పనులు నిర్వహిస్తారు ?

ఎంపీవో: మురికి కాలువలు పూడికతీత పనులు నిర్వహిస్తూ గ్రామాలలో నీటి నిలువ లేకుండా చర్యలు తీసుకుంటాం. మురికి కాలువల పూడిక తీసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

- ఓదెల

రుణాల పేరిట మోసం

- లాగిన్, ప్రాసెసింగ్ ఫీజు పేరిట వసూళ్లు
- మంథనిలో బోర్డు తిప్పేసిన శ్రీబాలాజీ అసోసియేట్స్
- కేసు నమోదు

మంథని, మే 16 (ఆంధ్రజ్యోతి): మంథనిలో మరో ఫైనాన్స్ కంపెనీ బోర్డు తిప్పేసింది. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక అవసరాలకు రుణాలు ఇప్పిస్తామని ఆశ చూపి లాంగిన్, ప్రాసెసింగ్ ఫీజుల పేరిట అందినకాడికి దండుకొన్న శ్రీబాలాజీ అసోసియేట్స్‌పై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్థిక అవసరాల కోసం నిత్యం వందలాది మంది ప్రజలు బ్యాంక్‌లతో పాటు ప్రైవేట్ ఫైనాన్స్‌ల చుట్టూ తిరుగుతున్నారు. వీరి అవసరాలను ఆసరాగా చేసుకొని కొందరు ప్రైవేట్ ఫైనాన్స్‌ల పేరిట బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించుకొని లోన్లు ఇస్తామని ప్రచారం చేస్తారు. లోన్ల కోసం వచ్చే వారి వద్ద చెక్కులు, ఆధార్ కార్డులు, బ్యాంక్ పాసుబుక్కులు, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకొని వారి నుంచి లక్షకు రూ.5,100 లాగిన్ అమౌంట్,



మూసి ఉన్న శ్రీబాలాజీ అసోసియేట్స్ ఫైనాన్స్ బ్రాంచ్

రూ.3,300 ప్రాసెసింగ్ ఫీజుల పేరిట వసూలు చేస్తారు. అనంతరం సిబిల్ స్కోర్ లేదని, డాక్యుమెంట్స్ సరిగా లేవని, ప్రాసెసింగ్ టైం పడుతుందని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇందుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సైతం నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదు. మంథనిలోని ఆర్టీసి బస్సు డిపో సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీబాలాజీ అసోసియేట్స్ ఫైనాన్స్‌లో సైతం ఇదే విధంగా జరగడంతో గురువారం రాత్రి బాధితులు నిర్వాహకులతో ఘర్షణకు దిగి దాడికి యత్నించినట్లు సమాచారం. బాధితులు మంథని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అసోసియేషన్ చైర్మన్ దోమల రమేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. శ్రీబాలాజీ అసోసియేషన్ ఫైనాన్స్ వారు ఇప్పటికే ప్రజలను దోచుకొని గోదావరిఖని, పెద్దపల్లి బ్రాంచ్‌లు సైతం మూసి వేసినట్లు తెలిపారు.

మట్టి లారీలను అడ్డుకున్న యువకులు



లారీలను అడ్డుకుంటున్న యువకులు

ఓదెల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్ అప్పమాయ చెరువు నుంచి నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తున్న లారీలను శుక్రవారం గ్రామ యువకులు అడ్డుకున్నారు. కొలనూర్‌లో నల్ల మట్టి తవ్వకాలను ప్రారంభించారు. ఈ మేరకు కలెక్టర్ ఇచ్చిన అనుమతి పత్రంలో స్పష్టత లేకుండా ఉన్నదని నిరసిస్తూ ఓవర్ లోడ్‌తో వెళుతున్న మట్టి లారీలను గ్రామస్థులు, యువకులు లారీలను అడ్డుకొని నిరసన తెలిపారు. విషయం తెలుసుకొని అక్కడి చేరుకున్న తహసీల్దార్ నిరసన తెలుపుతున్న యువకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరులతో జక్కుల మధు మాట్లాడుతూ తహసీల్దార్ నల్ల మట్టి లారీలు పోతాయని, దమ్ముంటే అడ్డుకోండని మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్నారు. తహసీల్దార్ ఆదేశంతో సీఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన వ్యక్తం చేస్తున్న జక్కుల మధు, సాతూరి అనిల్, మద్దెల శ్రీనివాస్, రేగుల తిరుపతి, మాటూరి వంశీని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. దీంతో నల్ల మట్టి తవ్వకాలు ఆగకుండా ఇటుక బట్టీల యజమానులు గ్రామంలోని అల్లిమాను చెరువులో తవ్వకాలు ప్రారంభించేందుకు సంసిద్ధం చేశారు. చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతిని రద్దు చేయాలని కొలనూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా అలాంటిదేమి లేదని, తాను ఎవరితో మాట్లాడలేదని పేర్కొన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్‌ను విమర్శిస్తే ఊరుకోం

కళ్యాణ్‌నగర్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ఎంపీ ఈటల రాజేందర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగడం సరైంది కాదని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడుగు కృష్ణ అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో పేదల ఇండ్లు ప్రభుత్వం అన్యాయంగా కూల్చి వేస్తుందని, పేదల పక్షాన నిలబడ్డ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు దూషణలకు దిగడం సరైంది కాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీల పేదల పక్షాన ఉండి ప్రశ్నిస్తూనే ఉంటారని, దాని రాజకీయం చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతిపక్షాలను, ప్రజలను భాగస్వామ్యులను చేయాలి కానీ ఇలా వ్యక్తి గత దూషణలకు దిగడాన్ని ముదిరాజ్ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. ముదిరాజ్ కులానికి, ఈటల రాజేందర్‌కు కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలన్నారు. నాయకులు పిల్లి శివయ్య, దబ్బెట శంకర్, రజినికాంత్, ప్రభాకర్, రాయనర్సు సంపత్, మల్లయ్య, రవికుమార్, శ్యాం, సాయిచరణ్, వంశీ, కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

ముత్తారం, మే 16 (ఆంధ్రజ్యోతి): లక్కారం, కాశీపేట మచ్చుపేట గ్రామాలలోని నాటు సారాయి అమ్మకాలు జరుపుతూ పట్టుబడిన వ్యక్తులను శుక్రవారం తహసీల్దార్ మధుసుదన్ రెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. మళ్ళీ నాటు సారా అమ్మితే లక్ష రూపాయల జరిమానా చెల్లించాలని సూచించి బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్ సిబ్బంది రాజేందర్ రాజ్ కుమార్ శ్రీను రవి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే

గోదావరిఖని, మే 16(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ 35వ డివిజన్‌లో నివాసముండే గురిశెట్టి శ్యామల, శంకర్ దంపతులకు గాజుల కిరణ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఇంటిని శుక్రవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చేత గృహ ప్రవేశం చేయించారు. నిరుపేదలైన శ్యామల దంపతులకు ఇంటిని నిర్మించి ఇచ్చామన్నారు. కాల్వ లింగస్వామి, బొంతల రాజేష్, ఎల్లయ్య, ఎండీ ముస్తాఫా, దూళికట్ల సతీష్, గట్ల రమేష్ పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు ఎన్వీ దుర్గాప్రసాద్

సుల్తానాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా బోధనలో మెళకువలు తెలుసుకుని అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని విద్యా శాఖ రాష్ట్ర పరిశీలకులు ఎన్వీ దుర్గా ప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. గర్రెపల్లిలో నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠ్యపుస్తకాలలో పొందుపరిచిన బోధన వ్యూహాలు అమలు చేయాలన్నారు. లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్స్ ఉపయోగించి టెక్నాలజీ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా విద్యాధికారి మాధవి, కోర్సు డైరక్టర్ అరేపల్లి రాజయ్య, ప్రద్యుమ్నకుమార్, గడ్డం జగదీశ్వర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పైపుల ఫ్యాక్టరీని ప్రారంభించిన ఎమ్మెల్యే

జూలపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరావుపేట గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పైపుల ఫ్యాక్టరీని శుక్రవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఫ్యాక్టరీ యాజమాన్యంతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ఫ్యాక్టరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్లు, పీఎంఏవై, రేషన్‌కార్డుల లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్, రామగుండం నగర కమిషనర్ అరుణశ్రీ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులకు ఆమె దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఆయా పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలన్నారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా డివిజన్లలో పూడికతో నిండిన కాలువల వివరాలు, మొక్కలు నాటడానికి అనువైన స్థలాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో డీసీ వెంకటస్వామి, ఈఈ రామన్, డీఈ హన్మంతు నాయక్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టణంలో పందులను నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

పెద్దపల్లిటౌన్ మే 16 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో పందులు లేకుండా నిర్మూలించాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పందుల పెంపకం దారులను సూచించారు. శుక్రవారం పందుల పెంపకం దారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో పందులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాగే కొందరు ఇండ్ల మధ్యలో పందులను పెంచుతున్నారని, వాటిని పట్టణానికి దూరంగా పెంచాలన్నారు. లేకుంటే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వారి సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకురాగా త్వరలోనే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వార్డ్ ఆఫీసర్లు అనిల్, ప్రదీప్, సుధీర్, అనూష మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన



కాల్వశ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

ఎలిగేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): దోమలను నివారిస్తే డెంగ్యూ వ్యాధి వ్యాప్తి నివారణ సాధ్యమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిస్సీక్రిష్టాన అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు సుల్తాన్‌పూర్, ధూళికట్ట గ్రామాల్లో డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. నివాసాల ప్రాంతాల్లో నీటి నిలువలు ఉండకుండా చూసుకోవాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు వినయ, డాక్టర్ సింధూర, సూపర్‌వైజర్లు లక్ష్మణ్, నాగమణి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ డెంగ్యూపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. నీటి నిల్వ ఉంచరాదని, చెత్తచెదారం ఉండకూడదని, ఇంటిముందు శుభ్రత పాటించాలని సూచించారు. సీహెచ్‌ఓ సరస్వతి, పీహెచ్‌ఎస్ భాగ్యలక్ష్మి, హెచ్‌ఈఓ శ్రీనివాస్, వనీత్, హెల్త్ సూపర్‌వైజర్ నీరజ, ఏపీఎం కనుకయ్య, ఏఎన్ఎం సరోజన, పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకొని మేడారం పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సీ డాక్టర్లు అనుదీప్, సుస్మిత ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో జ్వర బాధితులు ఎవరైన ఉంటే మేడారం ప్రాథమిక కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గర్రెపల్లిలో డాక్టర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. గర్రెపల్లి కమాన్ చౌరస్తా వద్ద డాక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్‌ఈఓ అనీసొద్దిన్, భారతి, ఎలిజెబెత్ రాణి, డోలో రోజా పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటించాలని, ఇంటి చుట్టూ నీరు నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. సిబ్బంది గ్రేసీ మను, స్టాఫ్‌నర్స్ రవళి, ఝాన్సీ, అనిల్, ఫార్మసిస్ట్ జగదీష్, ఏఎన్‌ఎమ్‌లు స్రవంతి, రమాదేవి, దుర్గమ్మ, కళావతి, సునీత, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఇన్చార్జిలు దీప్తి. లావణ్య. శ్రీను పాల్గొన్నారు.



నిరసనలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యంరావు

కళ్యాణ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల దృష్ట్యా ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జూలై 9కి వాయిదా వేస్తున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు చెప్పారు. యుద్ధ వాతావరణ నేపథ్యంలో సమ్మెను వాయిదా వేశామని, ఈనెల 20న జిల్లా, పట్టణ, మండల కేంద్రాల పరిశ్రమల్లో నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు. కుమారస్వామి, మెండె శ్రీనివాస్, బిక్షపతి పాల్గొన్నారు.

సింగరేణి అధికారుల పరిశీలన



లక్ష్మీపురంలో పరిశీలన జరుపుతున్న సింగరేణి అధికారులు

కోల్‌సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 14వ డివిజన్ లక్ష్మీనగర్‌లో శుక్రవారం సింగరేణి ఆర్‌జీ-2 అధికారులు పరిశీలన జరిపారు. ఓసీపీ-3తో గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటాయని, వ్యవసాయ బావుల్లో నీరు లేనందున చెరువులకు ఓసీపీ నీటిని పంపింగ్ చేయాలని, కట్టపై రోడ్డు నిర్మించాలని, బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆర్‌జీ-2 అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శుక్రవారం సివిల్ డీజీఎం ధనుంజయ్, సూపర్‌వైజర్ నరేష్ పరిశీలన జరిపారు. కందులసతీష్, చుక్కల శ్రీనివాస్, గౌస్, కుంట సది, కనకరాజు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె వాయిదా

యైటింక్లయిన్‌కాలనీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరగబోయే సార్వత్రిక సమ్మెను కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర్య రంగాల సమాఖ్యలు జూలై 9కి వాయిదా వేశాయని సింగరేణి కాలనీ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంటప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగిందని, దేశంలో నెలకొన్న ఉద్రిక్తత, రాజకీయ పరిణామాల నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నామని ప్రవీణ్ తెలిపారు.

రక్తపోటు నియంత్రణతో ఆరోగ్యం

యైటింక్లయిన్‌కాలనీ, మే 16(ఆంధ్రజ్యోతి): రక్తపోటు నియంత్రణతో ఆరోగ్యంగా ఉండవచ్చని సెక్టార్-3 డిస్పెన్సరీ సూపరింటెండెంట్ డా. మహిపాల్, ఆర్జీ-2 పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్‌లు ప్రకటనలో తెలిపారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగుల్లో అవగాహన కల్పించేలా రక్తపోటు నియంత్రణ సూచనలతో ప్రకటన విడుదల చేశారు. హైబీపీతో గుండెపోటు, మూత్రపిండాల సమస్య, దృష్టి మందగించడం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నట్టు తెలిపారు. బీపీ నియంత్రణలో ఉండాలంటే నిత్యం వ్యాయామం, ఆహారంలో ఉప్పు తగ్గించడం, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తినడం, సరిపడా నిద్ర, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని తెలిపారు. ఉద్యోగులు ఆరోగ్యవంతమైన ఉద్యోగులే సింగరేణికి బలమని, రక్తపోటుపై ప్రతి ఉద్యోగి అవగాహన కల్గిఉండాల్సిన అవసరం ఉన్నట్టు డా. మహిపాల్, అనిల్‌కుమార్‌లు ప్రకటనలో పేర్కొన్నారు.

బడిబాటకు మంచి స్పందన



నర్సాపూర్‌లో బడిబాట

ఎలిగేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని ఎంఈవో అనసూరి నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గంగ్రదేవేందర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. హెచ్ఎంలు వెంకటేశ్వర్‌రెడ్డి, బిజిలి సదయ్య, లలిత, సుధాకర్, ఆనంద్, మల్లేశం, జ్యోతి, వివోఏపద్మ, సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కాల్వశ్రీరాంపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌కు చెందిన సురేష్ 20సంవత్సరాలుగా కాల్వ శ్రీరాంపూర్‌లో హోటల్ నడుపుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సురేష్ కూతురు కుష్బూ ఊపిరితిత్తుల వ్యాధితో విషమ పరిస్థితిలో ఉంది. కూతురికి చికిత్స చేయించడానికి సురేష్‌కు డబ్బులు లేకపోవడంతో కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ జనగామ రవి స్పందించి తనవంతుగా నాలుగు వేల రూపాయలు అందజేశారు.

దళిత సంఘాల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పెద్దపల్లిటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎంపీ వంశీకృష్ణ ఫొటోను ఫ్లెక్సీలో పెట్టలేదని శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కాళేశ్వరం పుష్కరాలలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫొటో ఫ్లెక్సీలలో లేకపోవడంతో దళిత నాయకుని అవమానించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బొంకూరి కైలాసం కుక్క చంద్రమోగిలి, చాట్ల అమరజ్యోతి, నెలకంటి కుమార్, బోసెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్య



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని శుక్రవారం మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామంలో ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తారని, ప్రయివేట్‌లో చదివించి ఆర్థికనష్టాలకు గురికావద్దని వారికి సూచించారు. ప్రచారంలో ఉపాధ్యాయులు సట్టు కనుకయ్య పలువురు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

పెద్దపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప శుక్రవారం ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, తడిసిన ధాన్యానికి కూడా మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఎలాంటి తరుగులేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. చెల్లింపులు కూడా రెండు, మూడు రోజుల్లోనే జరుగుతున్నాయని తెలిపారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి

కోల్‌సిటీ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో అనుమతులు లేని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీయూఎస్ జిల్లా అధ్యక్షుడు జార్జిరెడ్డి శుక్రవారం రామగుండం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని, వీటిపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్షిత్, రాజు, తేజ, రవి, నరేష్, మహేష్ పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి

సుల్తానాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): హన్‌మాన్ జయంతిని పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలో ఈనెల 18న చేపట్టనున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని హనుమాన్ స్వాములు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు హన్‌మాన్ శోభాయాత్ర ప్రారంభమవుతుందని, పట్టణ పురవీధుల గుండా కొనసాగుతుందన్నారు. శోభాయాత్రలో హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

సుల్తానాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులకు బ్యాంక్ అధికారులు రూ. 20 లక్షల బీమా సొమ్మును అందజేశారు. గర్రెపల్లి గ్రామానికి చెందిన బోగిరి గట్టయ్య రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన గతంలో గర్రెపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్సు కింద వెయ్యి రూపాయల ప్రీమియం చెల్లించాడు. ప్రమాదంలో మరణించినందున బ్యాంక్ మృతుడి నామినీ భోగిరి రాజేశ్వరికి శుక్రవారం బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కును అందజేశారు. రీజనల్ అధికారి సుబ్బారావు, సాయిక్రిష్ణ, మేనేజర్ దేవేందర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



ధూళికట్టలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీఆర్‌డీవో

ఎలిగేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్ట, ఎలిగేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం డీటీసీఎస్ రవీందర్, అడిషనల్ డీఆర్‌డీవో రవికుమార్ సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. వడ్ల తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. బుక్స్ వెరిఫికేషన్, రిసీట్స్, డేటాఎంట్రీ, తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఐకేపీ ఏపీఎం సుధాకర్, సీసీలు ఆనంద్, మల్లేశం ఉన్నారు.